నాట్ 'గుడ్డు' 7
» పడిపోయిన గుడ్డు ధర

కాకినాడలో ఐటా జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభం 7



ఖాళీ..రైలు!

రైల్వే బడ్జెట్‌లో నిరాశే

నిర్మలమ్మ పద్దు ఉమ్మడి జిల్లాలోని రైల్వేకి నిరాశను మిగిల్చింది. గతంలో ఇచ్చిన కేటాయింపులనే ఇప్పుడు మళ్లీ కొత్తగా ప్రకటించడంపై గోదావరి వాసులు విస్తుపోతున్నారు. పుష్కరాలకు ఇంకో రెండేళ్ల సమయం మాత్రమే ఉంది. కేంద్ర బడ్జెట్‌లో కొత్త లైన్లు గానీ, కొత్త రైళ్లు గానీ లేవు. వందేభారత్ రైళ్లనే తెరపై చూపిస్తూ సామాన్యుల ప్రయాణ పాట్లను పక్కన పెట్టేశారు. మొత్తానికి కేంద్రం, రాష్ట్రంలో మంచి పరిచయాలున్న కూటమి నేతలు, ఎంపీలు ఉన్నా జిల్లాకు అమృత్ భారత్, వందే భారత్ తప్ప ఈ బడ్జెట్‌లో మరేమీ ఒరగకపోవడంపై విమర్శలు వినవస్తున్నాయి.

- నాటి అమృత్ నిధులే.. కొత్తగా..
- బడ్జెట్‌లోనూ ఆ రూ.270 కోట్లే
- పుష్కరాల నిధులపై క్లారిటీ నిల్
- గతంలో ఇచ్చినవే కొత్తగా చెప్పిన వైనం
- కడియం-నిడదవోలు లైన్‌కు నిధులేవి!
- కొవ్వూరు,అనపర్తిలో హాల్ట్‌ల ఊసేలేదు
- వృద్ధులు, జర్నలిస్టుల రాయితీ మరిచారు
- బడ్జెట్‌లో రైల్వే నిధులపై పెదవి విరుపు
- సామర్లకోటకు కేటాయింపుల్లేవ్

రాజమహేంద్రవరం/సామర్లకోట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అంతా పాతే.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన రైల్వేస్టేషన్లకు కొత్త కేటాయింపులు లేకపోవడంతో రైల్వే బడ్జెట్ నిరాశమిగిల్చింది.2027లో గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఖచ్చితంగా కేటాయింపులు ఉంటాయని అంతా ఆశించారు.అయితే ఏమీ లేకపోవడంపై పెదవి విరుస్తున్నారు. కేంద్ర రైల్వే బడ్జెట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రైల్వేస్టేషన్ల అభివృద్ధికి తాజాగా నిధులేమీ కేటాయించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిలిపివేస్తున్న పలు రైళ్లను యథాతథంగా నడిపేందుకు తాజాగా రైల్వే ఏ కీలక నిర్ణయం తీసుకోలేదు.

ఇప్పటికే అధికం

రాజమహేంద్రవరం రైల్వేస్టేషనుకు ఇప్పటికే సామర్థ్యానికి మించి రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. గూడ్స్ రైళ్లతో కలిపి 200 రైళ్లు పరుగులు పెడుతున్నాయి. దీంతో ఒక రైలుకు, మరో రైలుకు మధ్య ప్రయాణ నిడివి బాగా తగ్గిపోయింది. ఈ క్రమంలో పుష్కరాలకు కొత్త రైళ్లు వేస్తే వాటిని ఎలా నడిపిస్తారో చూడాల్సి ఉంది. ఆర్చ్ బ్రిడ్జి నిర్మించిన సమయంలో పక్కనే మరో వంతెన నిర్మాణానికి అనువుగా స్పాన్ (స్తంభాలు)లలో ప్రొవిజన్ పెట్టారు. అంటే ఇప్పుడు వంతెన నిర్మిస్తే సరిపోతుంది. స్పాన్‌లు నిర్మించాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఉన్న ఆర్‌సీఆర్‌బీ,ఆర్చ్ బ్రిడ్జిలపై ట్రాఫిక్ దృష్ట్యా రైళ్లను కొవ్వూరులో లేదా ఔటర్‌లో కొద్ది సేపు నిలపడం చేస్తున్నారు. దీంతో ఆర్చ్ బ్రిడ్జిపై వంతెన నిర్మాణమైతే చాలా ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా కడియం నుంచి నిడదవోలు వరకూ లైను వేయడం ద్వారా గూడ్స్ రైళ్లను మళ్లించడం ద్వారా రాజమండ్రి స్టేషనుపై ఒత్తిడి తగ్గించవచ్చనే ఆలోచన చేస్తున్నారు.ఈ లైను విషయం ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉంది. దీని నిధుల విషయం కూడా బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. నిడదవోలు రైల్వేస్టేషన్‌లో 1.5 కిలోమీటర్ల లూప్ లైను నిర్మిస్తున్నామని మాత్రం చెప్పారు.

గోదావరి స్టేషన్ వదిలేశారా?

రాజమహేంద్రవరంలో గోదావరి రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. పుష్కరాల సమయంలో ఈ రైల్వే స్టేషను రద్దీలో భాగం పంచుకుంది.ఈ రైల్వేస్టేషను పుష్కర, కోటిలింగాల ఘాట్లకు దగ్గరగా ఉండడంతో ఎక్కువ మంది జనం ఈ రైల్వేస్టేషనులోనే దిగుతారు. పైగా సాధారణ రోజుల్లో కూడా ఇక్కడ రైళ్లను ఆపాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది.ఈ రైల్వేస్టేషన్‌ని పుష్కరాలనాటికి అభివృద్ధి చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఇలా రాజమండ్రి రైల్వేస్టేషను అభివృద్ధి నిధులనే బడ్జెట్‌లో చూపించి సరిపెట్టుకోమనడంతో బడ్జెట్‌పై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు.

ఆర్వోబీలు, ఆర్‌యూబీలు ఎక్కడ?

రైల్వేగేట్లవద్ద ప్రమాదాలను శాశ్వతంగా నివారించేందుకు, ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు 2027 నాటికి అన్ని రైలు గేట్లను తొలగిస్తామన్న రైల్వే గతంలో చేసిన ప్రకటన నేడు ప్రచారంలో లేకపోవడం విచారకరం. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో గూడూరు నుంచి అనకాపల్లి స్టేషన్ల మధ్య 390 రైలు గేట్లు ఉన్నట్టు గతంలోనే రైల్వే అధికారులు గుర్తించారు.వీటిని తొలగించి ఆర్‌యూబీలు, ఆర్వోబీలు నిర్మిస్తామన్నారు.వీటికోసం రూ.2,400 కోట్ల మేర నిధులు ప్రతిపాదించారు.ప్రస్తుత బడ్జెట్‌లో వీటి నిర్మాణాలకు నిధులు కేటాయింపులు లేకపోవడంపై రైల్వే అధికారులు ఖంగుతిన్నారు.

పుష్కరాలకు నిధుల్లేవ్..

కుంభమేళాకి ప్రయాగ్‌రాజ్.. గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం. 2027లో పుష్కరాలు జరగనున్నాయి.ఈ మేరకు ఇప్పటి నుంచీ నిధులు సమకూరితే తప్ప ప్రయోజనం ఉండదు.ఈ బడ్జెట్‌లో పుష్కరాలకు నిధుల కేటాయిస్తారని గోదావరి జనం ఆశించారు.కానీ అమృత్ భారత్ కింద రాజమహేంద్రవరం,నిడదవోలు,సామర్లకోట రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని మాత్రమే పేర్కొన్నారు.ఇప్పటికే రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు రూ.271 కోట్లు కేటాయించారు. పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయి.దీన్నే కొత్తగా ఇచ్చినట్లు చూపించడం విస్మయానికి గురిచేస్తోంది. రాజమహేంద్రవరం ఎంపీగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉన్నా కేటాయింపులు లేకపోవడం విస్మయానికి గురిచేస్తుంది.ఇక కొవ్వూరు-సత్తుపల్లి రైల్వే లైను గురించి ప్రస్తావన లేకపోగా..కరోనా సమయంలో కొవ్వూరు, అనపర్తి స్టేషన్లలో రైళ్ల హాల్ట్ నిలుపుదల చేశారు.అదే సమయంలో వృద్ధులకు,జర్నలిస్టులకు రైలు ప్రయాణాల్లో ఇచ్చే రాయితీని తీసేశారు.ఈ సారి బడ్జెట్‌లో వీటి పునరుద్ధరణపై ప్రకటన వెలువడుందని ఆశించినా నిరాశే మిగిలింది. రాజమహేంద్రవరం నుంచి బెంగళూరు,భువనేశ్వర్‌లకు రెండు వందేభారత్ రైళ్లను గతంలోనే ప్రకటించారు. ప్రస్తుతం వాటి నిమిత్తం రాజమహేంద్రవరం మెము కార్ షెడ్‌లో పనులు జరుగుతున్నాయి.ఇవి కాకుండా హైదరాబాద్, బెంగళూరు,భువనేశ్వర్‌లకు సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా రాజమండ్రి నుంచి బయ లుదేరే విధంగా నడపాలనే డిమాండ్ ఉన్నా నిరాశే మిగిలింది.

నాటి అమృతమే.. నేడేం లేదు..

ఆంధ్ర ప్రదేశ్‌లోని అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి పథకంలో 72 ప్రధాన రైల్వేస్టేషన్లను రూ.3,141 కోట్ల మేర నిధులతో అభివృద్ధి చేసేందుకు గతేడాది ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేశారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు సుమారు రూ.271 కోట్లు, సామర్లకోట స్టేషన్‌కు రూ.15.13 కోట్లు కేటాయించారు. ప్రస్తుత రైల్వే బడ్జెట్‌లో కేటాయింపులు భారీగా ఉంటాయని ఆశించారు. ఏమీ లేకపోవడంపై ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిడదవోలుజంక్షన్, కొవ్వూరు, రాజమహేంద్రవరం,కడియం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, కాకినాడ, పిఠాపురం, అన్నవరం తుని వంటి స్టేషన్లు ఉన్నా కనీసం పట్టింపే లేదు.రాజమ హేంద్రవరం,సామర్లకోట వంటి ప్రధాన రైల్వే స్టేషన్లలోనూ అమృత్ అభివృద్ధి పనుల్లో వేగం లేదు..



రండి.. బాబూ.. రండి

- జిల్లాలో 16 మద్యం దుకాణాలకు దరఖాస్తులకు ఇంకా రెండురోజులే గడువు
- ఈనెల ఐదో తేదీతో ముగియనున్న గడువు: 7న కలెక్టర్ సమక్షంలో డ్రా
- దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు: లైసెన్స్ ఫీజు రూ.35.75లక్షలుగా నిర్ణయం
- లైసెన్స్ ఫీజు భారీగా ఉండడంతో కల్లుగీత కార్మికుల నుంచి ఒక్క దరఖాస్తూ రాని వైనం
- అటు కాకినాడ నగరంలో కొత్తగా వాక్ ఇన్ స్టోర్: ఫీజు రూ.కోటి
- విజయవాడ వ్యాపారి ఒక్కరే దరఖాస్తు

(ఆంధ్రజ్యోతి, కాకినాడ)

జిల్లాలో కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలు కట్టబెట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. మొత్తం 16 వైన్‌షాపులను బీసీల కేటగిరీలో ఆ వర్గానికి కట్టబెడుతూ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో వీటికి దరఖాస్తులను ఆహ్వానిస్తూ జిల్లా ఎక్సైజ్‌శాఖ ప్రకటన విడుదల చేసింది. దీంతో వీటికి మరో రెండురోజుల్లో గడువు ముగియనుంది. అప్పటివరకు వచ్చిన దరఖాస్తులకు ఈనెల 7న జిల్లా కలెక్టర్ సమక్షంలో అధికారులు డ్రా తీయనున్నారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటివరకు కొనసాగుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసింది. దీనిస్థానంలో కొత్త లిక్కర్ పాలసీ తీసుకువచ్చింది. మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యాపారులే నిర్వహించేలా నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులోభాగంగా జిల్లాలో 155మద్యం దుకాణాలకు అక్టోబరులో దరఖాస్తులను ఆహ్వానించి డ్రా విధానంలో ఆయా వ్యక్తులకు షాపులు కట్టబెట్టింది. మరో 16 దుకాణాలను కల్లుగీత కార్మికులకు ఇవ్వాలని నిర్ణయించింది. ఆ వర్గంలో వారికి సైతం మద్యం దుకాణాలు చేతికి వచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఆ 16 దుకాణాలకు సంబంధించి కేవలం కల్లుగీత కార్మికులు మాత్రమే దరఖాస్తు చేసుకునేలా గతనెల 27న ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ఒక దుకాణం, సామర్లకోట, పిఠాపురం, పెద్దాపురం, తుని మున్సిపాల్టీల్లో చెరో దుకాణం శెట్టిబలిజ సామాజికవర్గానికి, సామర్లకోట, పిఠాపురం, తొండంగి మండలాల్లో చెరో దుకాణం గౌడ సామాజికవర్గానికి, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, గండేపల్లి, జగ్గంపేట, ప్రత్తిపాడు, కిర్లంపూడి, శంఖవరం, కోటనందూరు మండలాల్లో చెరో దుకాణం శెట్టిబలిజలకు కేటాయించారు. ఒక్కో దుకాణానికి దరఖాస్తు చేసుకునేవారు రూ.2లక్షలు ఫీజు కింద చెల్లించాల్సి ఉంది. దుకాణం డ్రాలో దక్కితే లైసెన్స్ ఫీజు కింద రూ.35.75లక్షలు చెల్లించాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ఇలా వచ్చిన దరఖాస్తులను ఈనెల 7న ఉదయం పది గంటలకు జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా నిర్వహించనున్నారు. దరఖాస్తుల దాఖలుకు ఈ నెల 5న సాయంత్రం 5గంటల వరకు గడువు ఉంది. వీటిని ఆయా మండలాల పరిధిలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో అందించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 16 దుకాణాలకు సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. ప్రస్తుతం ఈ దుకాణాలకు సంబంధించి నిర్ణయించిన లైసెన్స్ ఫీజు గత అక్టోబరులో డ్రాలో దుకాణం దక్కించుకున్న వారినుంచి వసూలు చేసిన దాంట్లో సగమే నిర్ణయించారు. ఈ మొత్తం అధికంగా ఉన్న నేపథ్యంలో చాలామంది 16 దుకాణాలకు సంబంధించి దరఖాస్తు చేయడానికి పెద్దగా ముందుకు రావడం లేదు.

ఆ ఫీజు కోటి..

కాకినాడలో కొత్తగా వాక్‌ఇన్‌స్టోర్ మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో ఆరు వరకు ఇవి ఉండేవి. వీటిని ప్రభుత్వమే నిర్వహించగా కూటమి ప్రభుత్వం రాగానే వీటిని రద్దు చేసింది. దీనిస్థానంలో ప్రైవేటు వ్యక్తులే ఈ వాక్‌ఇన్ స్టోర్ నిర్వహణకు ఇటీవల నోటిఫికేషన్ జారీచేసింది. భారీగా దరఖాస్తుదారులు వస్తారని భావించినా లైసెన్స్ ఫీజు రూ.కోటి ఉండడంతో చాలామంది వెనుకంజ వేశారు. విజయవాడకు చెందిన ఓవ్యాపారి ముందుకు వచ్చి దరఖాస్తుచేశారు. త్వరలో ఆయనకు దుకాణం అప్పగించే అవకాశం ఉంది.

కొనసాగుతున్న దివీస్‌ఫార్మా పైపులైన్ల పనులు

- మరో నాలుగురోజులపాటు ఈ పనుల నిర్వహణ
- కాలుష్యంపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- మత్స్యకారుల డిమాండ్లపై పరిష్కారానికి చర్చిస్తాం
- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 3(ఆంధ్ర జ్యోతి): తొండంగి తీరసముద్ర గర్భంలో దివీస్ సంస్థ డీసాలినేషన్ పైపులైన్ల పనులు రెండురోజులుగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో మత్స్యకార సంఘ ప్రతినిధులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివీస్ సంస్థ పారిశ్రామిక అవసరాలకోసం ఉప్పు నీటిని మంచినీరుగా మార్చి మిగులు లవణ జలాన్ని తిరిగి సముద్రంలో విడిచి పెట్టేందుకు సీబెడ్‌లో ఆరు మీటర్ల లోతున ఒక టిన్నర కిలోమీటర్ల పొడవున డీసాలినేషన్ పైపులైన్ పనులను ఆదివారం ప్రారంభించిందన్నారు. మరో 4,5 రోజులపాటు ఈ పనులు జరగనున్నాయన్నారు. జిల్లా ప్రగతికి మత్స్యకారుల జీవన భద్రత, పారిశ్రామిక వికాసం రెండూ అవసరమేనని, వీటి మధ్య సంతులనంతో అపోహలు, అనుమానాలు, భయాలకు తావులేని సహృద్భావ వాతావరణంలో, పరస్పర అవగాహన సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి అనుగుణంగా డీసాలినేషన్ పైపులైన్ల ఏర్పాటుకు అవగాహనతో సహకరిస్తున్న మత్స్యకార సంఘాలకు ఆయన ధన్యవాదాలు తెలపారు. తొండంగి మండలంలో 16 తీరగ్రామాల్లో 5వేల మత్స్యకార కుటుంబాలు చేపలవేటపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. వీరి ఆర్థిక స్థితిగతులను ఇప్పటికే సర్వే చేశామన్నారు. ఈ కుటుంబాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్వహించాల్సి ఉందన్నారు. తొండంగి తీర గ్రామాల్లోని మత్స్యకార కుటుంబాలు తరతరాలుగా కేవలం చేపలవేట పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. వేరే ఉపాధులకు, పనులకు వెళ్లడం లేదన్నారు. తొండంగి తీరంలో పరిశ్రమల ఏర్పాటువల్ల వీరి జీవనంపై ఎలా ప్రభావం ఉంటుందో, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి సూచనలను అనుసరించి ఈ విశ్లేషణ జరిపేందుకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీకి చెందిన శాస్త్రవేత్తలు ఈ అంశంపై అధ్యయనం చేశారన్నారు. నెలరోజుల్లో నివేదిక అందనుందన్నారు. ఈ నివేదిక వచ్చిన తర్వాత తొండంగి తీరగ్రామాల మత్స్యకారులు, వారిలో విద్యావంతులతో ప్రత్యేక అవగాహనకార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.

డిమాండ్లను పరిష్కరించకుంటే అడ్డుకుంటాం

-కోడ వెంకటరమణ, చొక్కా కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా మత్స్యకారుల సంఘం ప్రతినిధులు

మా డిమాండ్లను పరిష్కరించకుండా దివీస్ పైపులైన్ పనులు చేపడితే అడ్డుకుంటాం. దివీస్ ఫార్మాగానీ, అరబిందో సంస్థ వల్ల గానీ మత్స్యకా రులకు నష్టం కలుగుతుంది. మా డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించకపోతే పనులను అడ్డుకుంటాం. మత్స్యకారుల ఉపాధికి నష్టం కలిగితే ఉద్యమిస్తాం. దివీస్ ఫార్మా పరిశ్రమ సముద్రంలో వదిలే వ్యర్థాల వల్ల మత్స్యసంపద నశించిపోయి 16 గ్రామాలకు చెందిన 20వేలమంది మత్స్యకారకులు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఎదురౌతుందన్నారు. తమ జీవన భద్రతకు కొన్ని డిమాండ్లను దివీస్ సంస్థ అంగీకరించాలన్నారు. రేషన్‌కార్డు ఉన్న ప్రతి మత్స్యకార కుటుంబానికి నెలకు రూ.15వేల చొప్పున శాశ్వతంగా ఇవ్వాలన్నారు. కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం ఇవ్వాలన్నారు. 10లక్షల వరకు చికిత్సలు కల్పించే హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. చిన్న తెప్పలకు రూ.1.50లక్షలు, బోటుకు రూ.3లక్షలు, అలివి వలలకు రూ.3 లక్షల చొప్పున పరిహారం అందించాలని కోరుతూ డిమాండ్ల పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. మత్స్యశాఖ డీడీ కరుణాకరరావు, మత్స్యకార సంఘం ప్రతినిధులు చొక్కా అప్పారావు, చొక్కా మణికుమార్, సూరాడ గోపీ, సూరాడ రాంబాబు, చొక్కా జగన్నాథం, సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

ఒంటిమామిడిలో.. పోలీసు బందోబస్తు మధ్య కొనసాగిన పైప్‌లైన్ పనులు 7



తొండంగి మండలం ఒంటిమామిడిలో దివీస్ ఫార్మా గేటు వద్ద ఉన్న పోలీసు బందోబస్తు

తునిలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక రసాభాస



తుని మున్సిపాల్టీ కౌన్సిల్ హాల్‌లో వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో ఆందోళన చేపడుతున్న ఇరుపార్టీల నాయకులు

- ఎన్నిక అనైతికం అంటూ టీడీపీ శ్రేణుల ఆందోళన
- కౌన్సిల్ హాల్‌లో గంటపాటు టీడీపీ, వైసీపీ మధ్య వాగ్వివాదం గందరగోళ పరిస్థితి
- ఎట్టకేలకు ఎన్నిక వాయిదా వేసిన అధికార యంత్రాంగం

తుని రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తుని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక ప్రక్రియ రసాభాసగా మారింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాల్సిన ఈ ఎన్నిక ప్రక్రియ వైసీపీ నేతల తీరుతో వివాదాస్పదమైంది. రాష్ట్రంలో పలు మున్సిపాల్టీలకు ఖాళీ అయిన చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌ల ఎంపిక కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 3న ఎన్నికలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడంతో తునిలో వైస్‌చైర్మన్‌ల ఎన్నిక అనివార్యమైంది. అప్పటికే తుని మున్సిపాల్టీలో అసంతృప్తితో రగులుతున్న కొందరు కౌన్సిలర్లు తిరుగుబాటు చేస్తారన్న సమాచారంతో స్థానిక వైసీపీ నాయకులు క్యాంపు రాజకీయాలకు తెరదీశారు. దీంతో మెజార్టీ సంఖ్య కౌన్సిలర్లను ఏజెన్సీ ప్రాంతాలకు తరలించి ఎవరికీ అందుబాటులో లేకుండా చేశారు. సరిగ్గా ఎన్నిక సమయంలో మున్సిపల్ కార్యాలయంవద్ద వీరందరితో మున్సిపల్ చైర్మన్ ప్రత్యక్షమయ్యారు. ఈ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు, దళిత సంఘాల నాయకులు ఈ ఎన్నిక ప్రక్రియ అనైతికమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య అపహాస్యం చేసి పైచేయి సాధించాలని వైసీపీ భావిస్తే తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఆందోళనకు దిగారు. మున్సిపల్ కార్యాలయం గేటు వద్ద గంటపాటు ఇరు పార్టీల వాగ్వివాగాలతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి పాలక కౌన్సిల్ హాల్‌కు కౌన్సిలర్లను పంపించేందుకు చర్యలు చేపట్టారు. టీడీపీ, వైసీపీ నేతలు కౌన్సిల్ హాల్‌లోకి చొచ్చుకుని రావడంతో ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకోవడంతో కౌన్సిల్ హాల్ దద్దరిల్లింది. గంట సమయంపాటు కౌన్సిల్ హాల్‌లో ఈ తీరు కొనసాగడంతో ఎన్నికల అధికారి పి.వేణుగోపాలస్వామి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కౌన్సిల్ సభ్యులు వెనుదిరిగారు. అనంతరం ఇరుపార్టీల నాయకులు, పార్టీ కార్యాలయాల్లో ప్రెస్‌మీట్‌లు పెట్టి ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్నారు. మంగళవారం మరోమారు ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవడంతో ఏం జరుగుతుందోన్న ఉత్కంఠ నెలకొంది.

చూసొద్దాం రండి.. అంతర్వేది వైభవం
» నేటి నుంచి స్వామివారి దివ్య కల్యాణోత్సవాలు
» అంతర్వేదిలో అంగరంగ వైభవంగా ఏర్పాట్లు 6

వేడుకగా శ్రీపంచమి 6
» ఆలయాల్లో ప్రత్యేక పూజలు
» చిన్నారులకు అక్షరాభ్యాసాలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు తొలిరోజు ఒక నామినేషన్ 7



చూసొద్దాం రండి
అంతర్వేది వైభవం

సాగర సంగమ తీరాన కోరిన కోరికలు తీర్చే భక్తజన వరదుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి. ఆ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు 4వ తేదీ మంగళవారం రథసప్తమి పర్వదినాన ప్రారంభమవుతాయి. మంగళవారం నుంచి పది రోజుల పాటు స్వామివారి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల ముగింపులో అంతర్వేది ఆలయ ఉత్తర భాగంలో ఏర్పాటు చేసిన చెరువులో హంస వాహనంపై స్వామి-అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

● (అంతర్వేది/ఆంధ్రజ్యోతి)

- నేటి నుంచి స్వామివారి దివ్య కల్యాణోత్సవాలు
- అంతర్వేదిలో అంగరంగ వైభవంగా ఏర్పాట్లు
- మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణ
- పది రోజుల పాటు ఘనంగా జరగనున్న ఉత్సవాలు



నేడు స్వామి వారు పెండ్లికొడుకాయెనే..

కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులు సంయుక్త నిర్వహణలో మంగళవారం ఉదయం నుంచి అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా రథసప్తమి రోజున ఈ రెండు కుటుంబాల వారిచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నసమారాధన జరుగుతుంది. బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులచే స్వామివారికి మధుపర్కములు సమర్పించి మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు స్వామివారిని పెండ్లికుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరిస్తారు. స్వామి-అమ్మవార్లకు ఆలయ అర్చకులు, వేద పండితుల సారథ్యంలో ప్రత్యేక అలంకరణ నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణోత్సవాలకు లక్షలసంఖ్యలో భక్తులు విచ్చేస్తారని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.





విద్యుత్ దీపాలంకరణ

అంతర్వేదికి ఇలా రావొచ్చు..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి అంతర్వేది చేరుకునే భక్తులు రావులపాలెం, రాజోలు మీదుగా రావాల్సి ఉంటుంది. పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చే భక్తులు పాలకొల్లు, దిండి-చించినాడ వంతెన మీదుగా శివకోడు, మలికిపురం మీదుగా రావచ్చు.



ఉత్సవ ఏర్పాట్లను వివరిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



భారీ బందోబస్తు

స్వామివారి ఉత్సవాల్లో ముఖ్య భూమిక పోషించే పోలీసులు, బందోబస్తు మరింత పటిష్ఠంగా ఏర్పాటు చేయనున్నారు. వెయ్యి మంది పోలీసు సిబ్బందితో 9 సెక్టార్లుగా బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఒక ఎస్పీ, ఒక అడిషనల్ ఎస్పీ, 10 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 100 మంది ఎస్‌ఐలతో ఉత్సవాల్లో బందోబస్తు నిర్వహించనున్నారు. ఉత్సవాల ప్రధాన రోజుల్లో 20 డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ జరుగుతుంది. ఎన్డీఆర్ఎఫ్, స్పెషల పార్టీ, మెరైన్ పార్టీలతో పర్యవేక్షణ, 100 సీసీ కెమెరాల ఏర్పాటు, డిజిటల్ డిస్‌ప్లే, 12 ఎల్‌ఈడీ స్ర్కీన్లతో భక్తులకు స్వామివారి కల్యాణం తిలకించే అవకాశం. క్యూలైన్లలో పటిష్ఠమైన బారికేడింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఆరు ప్రసాదం కౌంటర్ల ఏర్పాటు. కల్యాణం అనంతరం భక్తులకు అక్షింతల పంపిణీ జరుగుతుంది.

పెంచిన ఆర్టీసీ బస్సు సర్వీసులు

లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల సందర్భంగా ఆర్టీసీ అమలాపురం, రాజోలు, రాజమహేంద్రవరం, కాకినాడ, భీమవరం, పాలకొల్లు డిపోల నుంచి 105 ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. కల్యాణోత్సవాలకు బస్సులను సిద్ధం చేశామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. అంతర్వేదికి రాజోలు నుంచి 31 కిలోమీటర్లు, రాజమహేంద్రవరం నుంచి 104, అమలాపురం నుంచి 63, కాకినాడ నుంచి 118 కిలోమీటర్లు, పాలకొల్లు నుంచి 41 కిలోమీటర్లు, భీమవరం నుంచి 64 కిలోమీటర్లు.

4 లక్షల మంది వస్తారని అంచనా..

● ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేవాదిదేవుడైన శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. స్వామివారి ఆలయంలో సోమవారం విలేఖరుల సమావేశం ఏర్పాటుచేసి మీడియాకు ఉత్సవాల ఏర్పాట్ల గురించి తెలిపారు. ఉభయ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అంతర్వేది పుణ్యక్షేత్రానికి స్వామివారి ఉత్సవాలను తిలకించేందుకు సుమారు 4లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశామన్నారు. ఫిబ్రవరి 4 నుంచి 13వ తేదీ వరకు దివ్యతిరు కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, కూటమి ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తూ 7న జరిగే కల్యాణం, 8న రథోత్సవం, 12న చక్రస్నానం, 13న జరిగే తెప్పోత్సవాల కార్యక్రమాలకు ఉన్నతాధికారులను నియమించినట్టు తెలిపారు. ప్రధానంగా ఆలయానికి చేరుకునే రహదారులను ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.22.31 కోట్ల నిధులతో ఎనిమిది పనులు చేపట్టామన్నారు. పంచాయతీరాజ్‌శాఖ ద్వారా రూ.22.30 లక్షల నిధులతో మూడు పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీమెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాబహదూర్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ దిరిశాల బాలాజీ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ పినిశెట్టి బుజ్జి, ఆకన బాబ్జినాయుడు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, కొప్పుల ఫణికుమార్, ముప్పర్తి నాని, బైరా నాగరాజు, పొన్నాల ప్రభ, పిండి సత్యనారాయణ, పోతురాజు కిశోర్, రావూరి నాగు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ప్రాంగణంలో అత్తిలి వారిచే పవన్‌వైష్ణవ కోలాట భజన మండలి ప్రదర్శన, 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు కేరళ వాయిద్యాలతో స్వామివారి గ్రామోత్సవం. 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు నగర సంకీర్తనతో స్వామివారి గ్రామోత్సవం. 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సుమారు 500 మంది మహిళా భక్తులచే లలితాసహస్ర పారాయణం. 10వ తేదీ రాత్రి 8.30 గంటలకు హైదరాబాద్ సురభి వారిచే స్వామివారి కల్యాణోత్సవ ప్రాంగణంలో మాయాబజార్ నాటకం, 11వ తేదీ రాత్రి 8.30 గంటలకు హైదరాబాద్ సురభి వారిచే భక్త ప్రహ్లాద నాటకం జరుగుతాయి.

సత్రాల్లో ఉచిత భోజనం

తీర్థ మహోత్సవాలకు వచ్చే భక్తులకు 60 సత్రాల ద్వారా ఉచిత భోజన సదుపాయం అందిస్తారు. 7, 8, 12, 13 తేదీలతో పాటు ప్రధానంగా 8న సుమారు 2లక్షల మంది భక్తులకు సత్రాల్లో అన్నసమారాధన జరుగుతుంది. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం రాజోలు డిపో నుంచి 40 బస్సులు, ఇతర డిపోల నుంచి 65 బస్సులు మొత్తం 105 బస్సు సర్వీసులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు.

వైద్య శిబిరాల ఏర్పాటు

శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఉత్సవాల్లో ఐదు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం లోపల, బయట. అటుకుల మండపం వద్ద ఎంపీపీ స్కూలులో, బస్టాండు, యాత్రికుల షెడ్డు, బీచ్ ప్రదేశాల్లో శిబిరాలు జరుగుతాయి. 108 వాహనాలు 3, 104 వాహనం 1, 26 మంది మెడికల్ సిబ్బంది, 85 మంది పారా మెడికల్ సిబ్బందితో మొత్తం 111 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఎవరికి ఎటువంటి సమస్యలున్నా శిబిరాలకు రావాలని అధికారులు కోరారు.



వెండి కవచ అలంకరణలో శ్రీరంగనాయకస్వామి

శ్రీరంగనాయక స్వామికి 6.129 కిలోల వెండి కవచం బహూకరణ

అంతర్వేది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలోని ఉపాలయంలో గల శ్రీరంగనాయకస్వామికి తెనాలికి చెందిన ఆలపర్తి పవన్‌కుమార్-జాహ్నవి దంపతులు, కుటుంబ సభ్యులు 6.129 కిలోల వెండి కవచాన్ని బహూకరించారు. తొలుత కవచానికి ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, స్థానాచార్యుడు వింజమూరి రామరంగాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ జరిపి రంగనాయకస్వామికి అలంకరించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాబహదూర్, ప్రముఖ సినీ నిర్మాత డీవీవీ దానయ్య, ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వెండి కవచాన్ని బహూకరిస్తున్న పవన్‌కుమార్-జాహ్నవి దంపతులు

మనుమరాలి అక్షరాభ్యాసంలో సినీ నిర్మాత డీవీవీ దానయ్య

అంతర్వేది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకుని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం అధిక సంఖ్యలో అక్షరాభ్యాసాలు జరిగాయి. తన మనుమరాలితో అక్షరాభ్యాసం చేయించడానికి వచ్చిన ప్రముఖ సినీ నిర్మాత డీవీవీ దానయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఓజీ' సినిమాను వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామన్నారు. ఈ సినిమా ప్రతి ఒక్కరినీ అలరించే విందు భోజనంలా ఉంటుందన్నారు. ఓజీ సినిమా పూర్తయిన తర్వాత మరికొన్ని ప్రాజెక్టులను తెరపైకి తీసుకువచ్చే ఆలోచన ఉందని చెప్పారు.





అయినవిల్లిలో ప్రత్యేక అలంకరణలో సరస్వతీ దేవి, చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

అయినవిల్లిలో వేడుకగా శ్రీపంచమి

శ్రీసిద్ధివినాయకస్వామి ఆలయంలో సరస్వతి, కలాల పూజ

అయినవిల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి పుణ్యక్షేత్రంలో వసంత పంచమి (శ్రీపంచమి)ని సోమవారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజ జరిపి సిద్ధివినాయకుని చెంత కలాలను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసిద్ధివినాయక స్వామి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయిస్తే విద్యాభివృద్ధికి ఆటంకాలు ఉండవని భక్తుల విశ్వాసం. దీంతో అక్షరాభ్యాసాల కోసం పిల్లలను తీసుకుని తల్లిదండ్రులు ఆలయానికి తరలివచ్చారు. ఉదయం 5 గంటల నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. అధికారుల అంచనాలకు మంచి భక్తులు సుదూర ప్రాంతాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. చిన్నారులతో పలకలపై 'ఓం నమః శివాయ నమః సిద్ధం నమః' అని తల్లిదండ్రులు, అర్చకస్వాములు, వేదపండితులు రాయించారు. భక్తులకు ఆలయ సహాయ కమిషనరు ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది సేవలందించారు. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. సోమవారం ఒక్కరోజు వివిధ సేవల ద్వారా రూ.6,13,639 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనరు సత్యనారాయణరాజు చెప్పారు.



అయినవిల్లిలో సిద్ది వినాయకస్వామికి జరిగిన కలాల పూజ



వసంతి పంచమి సందర్భంగా కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ప్రత్యేక అలంకరణలో లలితా అమ్మవారు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలోని ఓ ప్రైవేటు స్కూలులో సరస్వతీదేవికి విద్యార్థినుల నృత్య నీరాజనం



తూర్పు గోదావరి జిల్లా చాగల్లులో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు

నాటు 'గుడ్డు'

- పడిపోయిన గుడ్డు ధర
- పేపర్ ధర రూ.4.90పైసలు, కమింగ్ రేట్ రూ.4.37పైసలు
- కమీషన్లు పోను రైతుకు మిగిలేది రూ. 4.12పైసలే
- ధరలు ఇలా ఉంటే పౌల్ట్రీ పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకం



అనపర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సామాన్యుడికి తక్కువ ధరకు లభ్యమయ్యే పౌష్టికాహారంలో ముందు వరుసలో నిలిచేది కోడి గుడ్డు అనేది జగమెరిగిన సత్యం. అయితే మొన్నటి వరకు పౌల్ట్రీ రైతులు రారాజులుగా ఉంటే గత ఐదేళ్లగా పరిశ్రమ మనుగడ కష్టతరంగా మారింది. ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగాను వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న ఫీడ్ ధరలతో కోళ్ల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీనికి తోడు మందుల రేట్లు, విద్యుత్ ధరలు, ఇలా ప్రతీదీ పెరిగిపోవడం గుడ్డు ధర మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉండటంతో కోళ్ళ పరిశ్రమ నష్టాల బాట పట్టింది. గతంలో టన్ను మేత ధర రూ.15వేల నుంచి రూ.30వేల వరకు ఉంటే ప్రస్తుతం మేత ధర టన్ను రూ.30 వేలకు పైబడి ఉంది. ఏడాదిలో సగం రోజులు గిట్టుబాటు ధర పలికేది. కానీ ప్రస్తుతం గిట్టుబాటు ధర రెండు నెలలు కూడా ఉండకపోవడంతో మిగిలిన పది నెలలు నష్టాల ఊబిలో కూరుపోవాల్సి వస్తుంది. ఇతర రాష్ట్రాల్లో కోళ్ల పరిశ్రమ అభివృద్ధి చెందడం అక్కడి ప్రభుత్వాలు పౌల్ట్రీ రైతులకు రాయితీలు కల్పించడం ఏపీ లో మాత్రం ఎటువంటి రాయితీలు లేకపోవడంతో రైతులు నష్టాల బాట పట్టాల్సి వస్తుంది. చలికాలం ప్రారంభం నుంచి కొత్త ఏడాది ప్రారంభం వరకు సుమారు నెల 15రోజుల పాటు రూ.6పైబడి పలికిన గుడ్డు ధర ప్రస్తుతం రూ.4.90పైసలకు పడిపోయింది. ప్రస్తుతం ఉన్న ఫీడ్ ధరల ప్రకారం ఒక గుడ్డుకు రూ.5 వరకు ఖర్చవుతుందని, కేవలం 45రోజులు మాత్రమే ఆరు రూపాయిల వరకు పలికి ప్రస్తుత ధర పడిపోయిందని రైతులు వాపోతున్నారు. పేపర్ ధర రూ.4.90 ఉన్నప్పటికీ ఎగుమతుల వద్ద డిమాండ్ లేకపోవడంతో ట్రేడర్లు కమింగ్ రేటుకు మాత్రమే ప్యాకింగ్‌లు చేయడంతో ప్రస్తుతం రైతులకు రూ.4.37పైసలను అందిస్తుండగా దీనిలో ట్రేడర్లు కమిషన్ రూ.0.25పైసలు పోవడంతో ఇక రైతుకు రూ.4.12పైసలు మాత్రమే మిగిలుతుంది. రానున్న రోజులు ఈ ధర మరింత పతనమయ్యే పరిస్థితులు ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉభయ గోదావరి జిల్లాల్లో...

ఉభయ గోదావరి జిల్లాల్లో రోజుకు కోటిన్నర గుడ్లు ఉత్పత్తి కావడంతో రైతులు రోజుకు కోటి నుంచి కోటిన్నర వరకు నష్టపోయే పరస్థితి ఏర్పడింది. లక్ష కోళ్లు ఉన్న పరిశ్రమలో సుమారు 70వేల గుడ్లు దిగుబడి ఉన్నా రోజుకు లక్ష నుంచి లక్షన్నర మేర రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది. 2014 ఎన్నికల్లో ఏర్పడిన కూటమి ప్రభుత్వం కోళ్ల పరిశ్రమపై కొన్ని రాయితీలు ప్రకటించింది. దీంతో ఆ ఐదేళ్ల పాటు రైతులు నష్టాల బారిన పడినా కొంతమేర ఊరట చెందారు. కానీ తరువాత 2019లో వచ్చి న వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పౌల్ట్రీ రంగం వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదని కరోనా విపత్కర పరిస్థితిలో కూడా పరిశ్రమ తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేశామని కానీ ప్రభుత్వం మాత్రం మావైపు చూడలేదని కొందరు పౌల్ట్రీ పెద్దలు వాపోతున్నా రు. వచ్చేది వేసవి కాలం కావడంతో పరిశ్రమలో ఖర్చులు మరింత పెరుగుతాయని కోళ్లను కాపాడుకునేందుకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని, ప్రస్తుతం ఏర్పడిన కూటమి ప్రభుత్వం పౌల్ట్రీ రంగ ంపై దృష్టి సారించి కోళ్ల మేతకు అవసరమైన నూకలు, మొక్కజొన్నలతో పాటు విద్యుత్ చార్జీల పైనా రాయితీలు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

తొలిరోజు ఒక నామినేషన్

ఈ నెల 10 వరకు నామినేషన్ల స్వీకరణ.. 8, 9 తేదీలు సెలవు



ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రాజేంద్ర

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు నామి నేషన్ల స్వీకరణ తొలిరోజు సోమవారం ఒక నామినేషన్ దాఖలైంది. కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి పేపకాయల రాజేంద్ర ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. అభ్యర్థి రాజేంద్రతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. సోమవారం నామినేషన్ల స్వీకరణ చేపట్టగా ఈనెల 10 వరకు గడువు ఉంది. మధ్యలో ఈనెల 8, 9 తేదీలు సెలవు రోజులు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఏలూరు కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 11న పరిశీలన, 13న మధ్యాహ్నం 3గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉంది. 27 ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. మార్చి 3న ఏలూరులో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎమ్మెల్సీ ఎన్నికలకు 440 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 3,15,261 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి: ఆర్వో

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గంలో అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో మొత్తం 440 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 3,15,261 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఇప్పటివరకు అందిన 8,501 క్లెయిమ్‌లు పరిశీలించి 5వతేదీలోపు ఈఆర్‌వో నెట్‌లో అప్‌డేట్ చేస్తామని ఆయన తెలిపారు.

వ్యక్తిగత కారణాలతో వివాహిత ఆత్మహత్య

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం కాకినాడ రాగంపేటలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు రాగంపేటకు చెందిన వి.ఈశ్వర్, శిరీష రత్నప్రశాంతి (30) భార్యాభర్తలు. వారు ప్రే మించుకుని 2016లో వివాహం చేసుకున్నారు. వారికి 8ఏళ్ల బాబు ఉన్నాడు. వ్యక్తిగత కారణాలతో శిరీష రత్నప్రశాంతి సోమవారం మధ్యాహ్నం ఇంట్లో గదిలోకెళ్లి ఉరే సుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అది గమనించిన భర్త కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

వరకట్న వేధింపులే కారణం



మరణించిన బేబీరాణి

గొల్లప్రోలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ సోమవారం మరణించింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన శివకోటి బేబీరాణి (34), రాజులకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. బేబీరాణిని అదనపు కట్నం తీసుకురావాలని భర్త రాజు, అత్త ధనలక్ష్మి, మరిది శ్రీనులు వేధించడమే గాక శారీరకంగా, మానసికంగా హింసించేవారు. దీంతో ఆమె జనవరి 20న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బేబీరాణిని ఆమె తల్లి దడాల రమణ పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. తల్లి ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపులు, ఆత్మహత్య ప్రేరణ కింద కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

అవగాహనతో కేన్సర్‌కు అడ్డుకట్ట!

ప్రారంభదశలో గుర్తిస్తే వైద్యసేవలతో సత్ఫలితాలు

రాజమహేంద్రవరం జీటీజీహెచ్‌లో ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ సేవలు

నేడు కేన్సర్ డే సందర్భంగా ప్రత్యేక కథనం



రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మారిన ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వంశపార్యంపర్య కారణాలతో కేన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్నదని వైద్యులు చెబుతున్నారు. వీటితో పాటు కేన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం మరింత ప్రమాదకరంగా పరిణమిస్తోంది. కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే రేడియేషన్, కీమోథెరపీ ద్వారా చాలా వరకూ విస్తరించకుండా నివారించే అవకాశం ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అయితే కేన్సర్‌పై ప్రజల్లో చైతన్యం రాకపోవడం ప్రాణాపాయ పరిస్థితుల్లోకి నెడుతున్నదని, కొన్ని సందర్భాల్లో మరణాలు కూడా జరుగుతున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా నివారణకు సూచనలు ఇలా..

స్ర్కీనింగ్ అత్యంత ముఖ్యం

కేన్సర్ వ్యాధి నివారణలో స్ర్కీనింగ్ అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుంది. నివారణకు అవకాశం ఉన్న కేన్సర్లు అయిన రొమ్ము కేన్సర్, సర్వికల్ కేన్సర్, నోటి కేన్సర్‌లను ప్రారంభదశలోనే గుర్తించడం ద్వారా చాలా వరకూ నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అలాగే సేవల సమీకరణ జరగాల్సి ఉంటుంది. కమ్యూనిటీ స్థాయిలో ఎన్‌సీడీ 3.0 యాప్ ద్వారా ఆశా, ఏఎన్ఎంల సహకారంతో అనుమానిత వ్యక్తులను గుర్తించి అందుబాటులోని ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌కు పంపించడం ద్వారా సత్ఫలితాలు పొందే అవకాశం ఉంది. వీటితోపాటు కౌన్సెలింగ్, చికిత్స కౌన్సెలింగ్ ద్వారా నిర్ధారణ, అవసరమైన చికిత్సా సేవలను సమగ్రంగా అందించగలుగుతారు. వీటికితోడు ప్రజల్లో కేన్సర్‌పై అవగాహన పెరగాల్సి ఉంటుంది.

జీటీజీహెచ్‌లో ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్

రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్)లో ఏర్పాటు చేసిన ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌లో కేన్సర్‌కు సంబంధించి పలు రకాలైన వైద్యచికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ సర్జరీ, కీమో థెరపీ సేవలు లభిస్తున్నాయి. తల, మెడ సంబంధిత కేన్సర్‌లతోపాటు గైనిక్ సంబంధిత కేన్సర్లు, గ్యాస్ర్టో ఇంటెస్నియల్ కేన్సర్లు, స్కిన్ కేన్సర్లు వంటి వాటికి సర్జరీలు చేస్తున్నారు. వీటితోపాటు కీమో థెరపీ వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌లో డాక్టర్ ప్రశాంత్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తుండగా, ఒక గైనకాలజిస్ట్, ఒక రేడియేషన్ ఆంకాలజిస్ట్, సర్జికల్ ఆంకాలజిస్టు, ఈఎన్‌టీ స్పెషలిస్టు, శస్త్ర చికిత్స నిపుణురాలు అందుబాటులో ఉన్నారు. ప్రతి మంగళవారం, గురువారం జీటీజీహెచ్ ఓపీ బ్లాకులోని 222 నెంబరు గదిలో ముందస్తు కేన్సర్ నిరోధక సేవల ఓపీ నిర్వహిస్తున్నారు.

ప్రజల్లో అవగాహన పెరగాలి

కేన్సర్ పట్ల గ్రామీణ ప్రాంతాల వారితో పాటు పట్టణవాసుల్లోనూ పెద్ద అవగాహన లేకపోవడంతో కేన్సర్ కేసులు పెరుగుతున్నాయి. పొగాకు నమలడం, ధూమపానం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడంతో పాటు మంచి ఆహారం తీసుకోవాలి. క్రమం తప్పకుండా కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్‌కు దూరంగా ఉండవచ్చని జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ పేర్కొన్నారు.

నేడు కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా మంగళవారం రాజమహేంద్రవరంలో మెగా పబ్లిక్ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ఏవీ అప్పారావు రోడ్డులోని రామాలయం సెంటర్ నుంచి ఈ ర్యాలీ ప్రారంభమవుతుంది. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్, జీఎస్ఎల్ కేన్సర్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

మంచు మింగేసింది!

బైక్‌ను ఢీకొన్న వ్యాన్

ద్విచక్ర వాహనదారుడి తల పై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో యువకుడి మృతి



తానేటి హరిశ్చంద్ర ప్రసాద్‌బాబు (ఫైల్)

నల్లజర్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పొగ మంచు ఓ నిండు ప్రాణాన్ని బలి గొంది. సోమవారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని ఓ వ్యాన్ ఢీకొనడంతో కిందపడిపోయిన ఆ వాహనదారుడి తల పైనుంచి ట్రాక్టర్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా పోతవరం పాత పేటకు చెందిన తానేటి ప్రసాద్, భూలక్ష్మి దంపతులకు హరిశ్చంద్రప్రసాద్‌బాబు (24), కృష్ణబాబు, మమత సంతానం. ప్రసాద్‌కు ఆరు నెలల క్రితం నబీపేటకు చెందిన చిన్నారితో వివాహమైంది. ఆమె ప్రస్తుతం 4 నెలల గర్భిణి. ప్రసాద్ జంగారెడ్డిగూడెంలోని ఓ సెల్‌ఫోన్ షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం బైక్‌పై పోతవరం నుంచి కొయ్యలగూడెం వైపు వెళ్తుండగా షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో కొయ్యలగూడెం నుంచి నల్లజర్ల వైపు ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వ్యాన్ ఢీకొంది. దీంతో ప్రసాద్ కింద పడిపోయాడు. ఆ సమయంలో నల్లజర్ల నుంచి కొయ్యలగూ డెం వైపు వెనుక వస్తున్న ట్రాక్టర్ అతని తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడిక్కక్కడే మృతిచెందాడు. మంచు ప్రభావంతో డ్రైవర్లకు కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏ ఎస్ఐ మోహన్ రావు తెలిపారు.



ఘటనా స్థలంలో వ్యాన్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు పల్లి రమేష్(ఫైల్)

కొత్తపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట రెడ్డప్ప వారిపేటకు చెందిన ఇద్దరు మోటార్‌సైకిల్‌పై బోడిపాలెం వైపు వెళ్తుండగా అమలాపురం వైపు నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న లారీ ఆదివారం అర్ధరాత్రి వెనుక నుంచి ఢీకొనడంతో ద్విచక్ర వాహనం వెనుక వైపున కూర్చున్న పల్లి రమేష్(35)కు తీవ్రగాయలయ్యాయి. దీంతో అతడిని 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం రమేష్ మృతిచెందాడు. కాగా వాహనం నడుపుతున్న పల్లి వినోద్‌కు స్వల్పగాయాలయ్యాయి. రమేష్ తండ్రి చినసత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. కాగా రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెయింటింగ్ పనులు చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్న రమేష్ మృతితో ఆ కుటుంబానికి దిక్కెవరంటూ భార్య వరలక్ష్మి రోదిస్తున్న తీరు కలిచివేసింది.

మానవత్వాన్ని మరిచారు!

వృద్ధురాలిని రోడ్డుపై వదిలేశారు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు నమ్మించి పెన్షన్ ఇస్తుండగా

అడ్డుకున్న యూనియన్ల ప్రతినిధులు



అమలాపురం ఆర్టీసీ డిపో ఇన్‌గేట్ ఎదుట వృద్ధురాలు బంగారమ్మ



సచివాలయ ఉద్యోగిని నిలదీస్తున్న ఆటో యూనియన్ నాయకులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): 75 ఏళ్ల ఆ వృద్ధురాలి పేరు మద్దింశెట్టి బంగారమ్మ. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామం. మతిస్థిమితంలేని ఆమెను ఎవరో తీసుకొచ్చి కొన్ని నెలల కిత్రం అమలాపురం ఆర్టీసీ డిపో ఎదుట వదిలేశారు. అప్పటి నుంచి ఆటో యూనియన్ ప్రతినిధులు, పండ్ల వర్తకులు ఆమె ఆలనా, పాలనా చూస్తున్నారు. ఏం జరిగిందో ఏమో గత కొంతకాలంగా నడవలేని స్థితిలో ఉంది. అయితే వృద్ధురాలి రక్తసంబంధీకులమని చెప్పి సోమవారం ఉదయం మందపల్లి సచివాలయ ఉద్యోగిని తీసుకుని అమలాపురం ఆర్టీసీ బస్టాండు సెంటర్‌కు వచ్చారు. ఆ వృద్ధురాలికి నడిరోడ్డుపైనే ఐరిష్ తీసుకుని పెన్షన్ సొమ్ములను అప్పగిస్తుండడాన్ని స్థానిక యూనియన్ ప్రతినిధులు గుర్తించారు. వెంటనే అడ్డుకుని వారిని నిలదీశారు. మూడు నెలలకు సంబంధించి రూ.12వేలు పెన్షన్ నగదును తీసుకున్న మహిళను స్థానికులంతా నిలదీశారు. కనీసం తిండి పెట్టడంలేదు. ఆలనా పాలనా చూడకుండా మానవత్వాన్ని విడిచిపెట్టి రోడ్డుపై వదిలేసి పెన్షన్ సొమ్ములు పట్టుకుపోతారా అని మండిపడ్డారు. దాంతో ఆ మహిళ వృద్ధురాలి సోదరినని చెప్పడంతో పాటు మీరెవరు అడ్డగించడానికని ఎదురు తిరిగింది. దాంతో వివాదం చెలరేగింది. మండపల్లి సచివాయలం నుంచి వచ్చిన ఉద్యోగిని ఆటో యూనియన్ నాయకులు నిలదీశారు. రోడ్డుపై పడి ఉన్న వృద్ధురాలి ఐరిష్ తీసుకుని పెన్షన్ ఎవరికో ఇచ్చేస్తారా, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని హెచ్చరించారు. వృద్ధురాలు అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని చెప్పారనడంతో వచ్చాను. 3 నెలలుగా పెన్షన్ తీసుకోకపోవడం వల్ల ఈసారి పెన్షన్ ఇవ్వకపోతే ఆమె పెన్షన్ నిలిచిపోతుందని చెప్పడంతో ఆమె సోదరితో వచ్చాను. ఆసుపత్రిలో కాకుండా రోడ్డుపై ఉన్న బంగారమ్మను చూసి మొదట పెన్షన్ ఇవ్వనని చెప్పానని ఆమె వారికి బదులిచ్చింది. ఆమె సూచన మేరకు యూనియన్ ప్రతినిధులైన మట్టపర్తి నారాయణ, కల్వకొలను బాబి మందపల్లి ఎంపీటీసీకి ఫోన్ చేసి సమాచారం అందించారు. దాంతో ఆయన సూచనల మేరకు పెన్షన్ కింద ఇచ్చిన రూ.12వేలు నగదుతో పాటు బంగారమ్మకు సంబంధించిన రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పెన్షన్‌కార్డు వంటివన్నీ ఆమె సోదరి నుంచి తీసుకున్నారు. వాటిని తమ వద్ద భద్రంగా ఉంచామని, ఆ గ్రామ పెద్దలు వచ్చిన తరువాత వాటిని పెద్దల సమక్షంలో అందజేస్తామని తిరుమనాథం బుజ్జి, చిన్నా, దంగేటి మంగరాజుతో పాటు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు తెలిపారు.

ప్రభుత్వ హాస్టల్‌లో మత ప్రార్థనలు

ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



హాస్టల్‌లో ఏర్పాటు చేసిన ప్రార్థనల బ్యానర్

కొవ్వూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్‌లో మత ప్రార్థనలు నిర్వహించిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు రైల్వేస్టేషన్ సమీపంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలుర వసతిగృహంలో ఆదివారం అరుణోదయ ఆరాధనల పేరుతో మత ప్రార్థనలు నిర్వహించారు. వాటిని అటుగా వెళ్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధి కంటమణి రామ్‌కుమార్ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టడంతో విషయం బయటపడింది. మత ప్రార్థనలు ఇష్టం లేకపోవడంతో భవనం కిందకు వెళ్లిపోయామని విద్యార్థులు తెలిపారు. విద్యార్థుల నుంచి సమాచారం తెలుసుకున్న వార్డెన్ హాస్టల్‌కు చేరుకుని ప్రార్థనలను నిలుపుదల చేశారు. దీనిపై హాస్టల్ అధికారి ఆర్.చిరంజీవిని ప్రశ్నించగా భవన యజమానులు ప్రార్థనలు పెట్టుకుంటామని అడిగారని, ప్రభుత్వ భవనంలో ప్రార్థనలు నిర్వహించరాదని చెప్పామని, తాను ఇంటికి, హాస్టల్ విద్యార్థులు ఆడుకోవడానికి వెళ్లిన సమయంలో భవన యజమానులు అన ధికారికంగా అద్దెకు ఇచ్చిన పైఅంతస్తులో మత ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారని, సమాచారం తెలిసిన వెంటనే హాస్టల్‌కు వచ్చి ప్రార్థనలను నిలుపుదల చేయించామని పేర్కొన్నారు.

ఒంటిమామిడిలో..

పోలీసు బందోబస్తు నడుమ కొనసాగిన పైప్‌లైన్ పనులు

తొండంగి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడిలో దివీస్ ఫార్మా పైప్‌లైన్ పనులు పోలీసు బందోబస్తు నడుమ సోమవారం కూడా కొనసాగాయి. ఆదివారం ఉదయం నుంచీ డీసాలినేషన్ పైప్‌లైన్‌ను సముద్రంలోకి వేస్తున్నారు. రెండో రోజు ముందు జాగ్రత్త చర్యగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దివీస్ ఫార్మా గేటు వద్ద టెంట్ వేసి పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. మరికొంత మంది పైప్‌లైన్ వేసే ప్రాంతంలో ఉన్నారు. సముద్రం నీటిని పైపులైన్ ద్వారా ఫ్యాక్టరీకి తరలించి నీటిని శుద్ధి చేసి మంచి నీటిని ఫ్యాక్టరీ అవసరాలకు వినియోగించే నిమిత్తం వేసే పైపులైన్‌గా దీనిని పేర్కొంటున్నారు. మరోవైపు తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ టీడీపీ మత్స్యకార విభాగం జిల్లా అధ్యక్షుడు కోడ వెంకటరమణ, నేతలు చొక్కా కాశీశ్వరరావు, చొక్కా అప్పారావు, గంటా లక్ష్మణ్, మహంకాళి కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లారు.

కాకినాడలో...

ఐటా జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభం

కాకినాడఅర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి); వివిధరాష్ట్రాల క్రీడాకారులకు కాకినాడలో ఆతిథ్యం ఇవ్వడం కాకినాడ జిల్లాకు గర్వకారణమని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. కాకినాడ డీఎస్ఏ మైదానంలో సోమవారం రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలిండియా అండర్ 16 టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీవీ.రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నానాజీ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈనెల 3నుంచి 7వరకు జరిగే పోటీల్లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ డాక్టర్ శేషగిరి, ఆర్ఎంసీ మాజీ ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఎల్.సత్యనారాయణ ఉన్నారు.



కాకినాడలో ఐటా జాతీయస్థాయి పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్ ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎస్ఏ మైదానంలో ఈనెల 15నుంచి 28వరకు జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ఏర్పాట్లను సోమవారం జేసీ రాహుల్‌మీనా పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరుకానున్న ఐఏఎస్ క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు, మైదానంలో టోర్నమెంట్ నిర్వహించే ప్రదేశాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో ఎటువంటి తప్పిదాలు జరగకుండా ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలన్నారు. జేసీ వెంట ఆర్డీవో ఎస్.మల్లిబాబు, డీఎస్డీఈవో బి.శ్రీనివాసకుమార్, వివిధ శాఖాధికారులు ఉన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ

గోదావరిలో బాలిక మృతదేహం లభ్యం

తల్లి మందలించిందని ఇంటి నుంచి అదృశ్యం

కేసు నమోదు చేసిన పోలీసులు



మట్టపర్తి బేబి (ఫైల్)

మామిడికుదురు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బి.దొడ్డవరం గ్రామంలో ఆదివారం అదృశ్యమైన బాలిక మట్టపర్తి బేబి (14) మృతదేహం అప్పనపల్లి గోదావరిలో సోమవారం లభ్యమైంది. బేబి పెదపట్నంలంక జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తన స్నేహితురాలి వద్ద నుంచి బంగారు గొలుసు తీసుకుని దాన్ని మరొక స్నేహితురాలికి ఇచ్చినట్టు తల్లికి చెప్పింది. తన గొలుసు ఇవ్వమని స్నేహితురాలు తండ్రితో వచ్చి ఆ బాలికను అడగ్గా, ఇచ్చేసినట్టు వారికి బేబి చెప్పింది. సోమవారం నాటికి తన గొలుసు ఇచ్చేయాలని స్నేహితురాలు చెప్పింది. దీంతో శనివారం సాయంత్రం బేబిని తల్లి మందలించింది. ఇది జరిగిన కొద్దిసేపటికే బేబి అదృశ్యం కావడంతో బాలిక తల్లి నగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి వెనుకే గోదావరి నది ఉండడంతో అదృశ్యమైన బేబి నదిలో దూకేసి ఉంటుందని అనుమానించి ఆదివారం గాలింపు చేపట్టినప్పటికీ ఏవిధమైన ఆచూకీ తెలియలేదు. సోమవారం బాలిక మృతదేహం అప్పనపల్లిలో లభించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని మార్కెట్ ట్యాంక్‌ఏరియా, సినిమా రోడ్డులో పారిశుధ్య పనులను సోమవారం కమిషనర్ భావన తనిఖీ చేశారు. అనంతరం 2వ సర్కిల్‌లోని భాస్కర్‌నగర్, వెంకట్‌నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

అధ్యాపకులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలి : వీసీ


మాట్లాడుతున్న వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీలోని యూసీఈకే ఈసీఈ విభాగం గ్యాలరీ హాల్లో మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(మైటీ) సహకారంతో ఎన్ఐటీ వరంగల్‌లోని ఎలక్ట్రానిక్స్ ఐసీటీ అకాడమీ, జేఎన్టీయూకే సంయక్త ఆధ్వర్యంలో ఆప్టిమైజ్ సొల్యూషన్స్ ఫర్ ఐసీ డిజైన్ విత్ హ్యాండ్స్ ఆన్ సెషన్ ఆన్ సీఎంఓఎస్ డిజైన్ అనే అంశంపై వారంరోజులపాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ) సోమవారం ప్రారంభమైంది. వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ అధ్యాపకులు ఏదైనా నేర్చుకుంటూ ఉంటే ఎంత కష్టతరమైన అంశమైనా సులువుగా ఉంటుందన్నారు. రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, కన్వీనర్ లీలాకుమారి డైరెక్టర్లు కృష్ణప్రసాద్, పద్మప్రియ, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, అనుబంధ కళాశాలల అధ్యాపకులు, రీసోర్స్‌పర్సన్‌లు, పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉద్యోగుల సంఘం నేతలు


ఎమ్మెల్యే కొండబాబును సంఘం నేతలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి చేపట్టాల్సిన కార్యచరణపై వారు చర్చించారు. కార్యక్రమంలో రూరల్ నాయకుడు వాసిరెడ్డి ఏసుదాసు, ఉద్యోగుల సంఘం నేతలు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు సోమవారం సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు.

'దుంప సాగులో సస్యరక్షణ చర్యలు అవసరం'

పెద్దాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దుంప సాగులో రైతులు సస్యరక్షణ చర్యలను అవలంబించాలని దుంప పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ జానకి అన్నారు. స్థానిక దుంప పరిశోధనా స్థానం వద్ద ఎస్సీ ఎస్సీ పథకంలో భాగంగా దళిత రైతులకు దుంప సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎరువులు, మందులను అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుధీర్, సీతారామశర్మ, సునీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

'సమగ్రంగా భూముల రీ సర్వే'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదేశించారు. రీ సర్వేకు సంబంధించి కాకినాడలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహశీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ గతంలో పూర్తిస్థాయిలో రీసర్వే జరగని మండలాలైన పిఠాపురం, సామర్లకోట, కాజులూరు, తాళ్లరేవు మండలాల్లో రీసర్వే సమగ్రంగా నిర్వహించాలన్నారు. ఇళ్ల స్థలాలకు పూర్తి స్థాయి విచారణ చేసి నివేదిక రూపొందించాలన్నారు. కార్యాలయ పరిపాలనాధికారి డీటీపీ చైనులు, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

పొంచి ఉన్న ప్రమాదం!

పిఠాపురం దాసరి వారి వీధిలో విద్యుత్ స్తంభంపై పిచ్చి మొక్కలు
ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు


పిఠాపురం దాసరి వారి వీధిలో కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న కరెంటు తీగలు


విద్యుత్‌స్తంభంపై పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

పిఠాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలు తీరుతున్నాయి. అయితే తమ ప్రాంతంలో ఉన్న సమస్యను విద్యుత్ అధికారులు పరిష్కరించడం లేదని పిఠాపురంలోని 18వ వార్డులోని దాసరి వారి వీధికి చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాసరి వారి వీధిలో ఉన్న విద్యుత్ స్తంభంపైకి పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. అది కరెంటు స్తంభం అంటే నమ్మే పరిస్థితి కానరావడం లేదు. మొక్కలు అన్ని స్తంభంపైకి ఎగబాకడంతో చిన్నపాటి గాలి వీచినా, వర్షం పడినా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు వైర్లు కలిసిపోయి మంటలు చెలరేగుతున్నాయి. అదేవిధంగా ఇదే వీధిలో కరెంటు వైర్లు, ఇళ్ల సర్వీసు వైర్లు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. రాత్రి సమయాల్లో కొత్త వారు ఎవరైనా వస్తే ప్రమాదాలకు గురవుతారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిందకు వేలాడుతున్న కరెంటు తీగలను సరిచేయాలని, విద్యుత్ స్తంభంపై పిచ్చి మొక్కలు తొలగించాలని పలుమార్లు విద్యుత్‌శాఖాధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు స్పందించి తక్షణం తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కుంభమేళాకు స్పెషల్ బస్సు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపో నుంచి సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సును జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ ఎంవీవీ మనోహర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు కాకినాడ నుంచి బయలుదేరి భువనేశ్వర్, పూరి, కోణార్క్ మీదుగా ప్రయాగ్‌రాజ్ చేరుకుని అక్కడ త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు పూర్తయిన తర్వాత తిరుగు ప్రయాణంలో వారణాసి, గయా, బుద్ధగయ క్షేత్రాలు చూపించి తిరిగి జనవరి 11న కాకినాడ చేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకరరావు, పీఆర్వో పీహెచ్.వెంకటరాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


బస్సు ప్రారంభిస్తున్న అధికారులు

మండల, జిల్లా కమిటీల బలోపేతానికి కృషి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన


సమావేశంలో మాట్లాడుతున్న బిక్కిన

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బూత్ కమిటీలు, మండల కమిటీపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త వారి బూత్‌ల్లో కమిటీ సభ్యులను వేసుకుని మండల, జిల్లా కమిటీలు బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కొక్కిర్ల గడ్డ గంగరాజు, సంగడి సత్యం, చోడిశెట్టి రమేష్, బులెట్ సురేష్, మేడ విజయలక్ష్మి, మాలతి, శాఖ వెంకటేష్, బలరామకృష్ణ, నాగేశ్వరరావు, స్వామి, బర్రె శ్రీను పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ల ప్రతినిధుల సమావేశం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ల ప్రతినిధులతో సోమవారం ఉండవిల్లిలోని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ నివాసంలో జరిగిన సమావేశంలో కాకినాడ నుంచి యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. యూపీఈఐఎఫ్ చైర్మన్ దాసరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎర్రంశెట్టి సురేష్ ప్రైవేట్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. పదో తరగతి మార్కులు గ్రేడింగ్ విధానంలో కాకుండా మార్కుల విధానంలోనే కొనసాగించాలని, ఇంటర్నల్ మార్కుల విధానం సరైనది కాదని సూచించారు. వీటిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ తమ దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ల ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

పిచ్చి కుక్క దాడిలో 10 మందికి గాయాలు

పెద్దాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరివాడలో పిచ్చి కుక్క దాడి చేయడంతో 10 మంది గాయల పాలయ్యారు. గ్రామానికి చెందిన నాగులాపల్లి రామారావు, ఇనకొండ కృష్ణమూర్తి, మణికంత, గోపు ఆదిలక్ష్మీతో పాటు మరో ఆరుగురిపై పచ్చి కుక్క దాడి చేసింది. దీంతో బాధితులు పెద్దాపురం సీహెచ్‌సీకి వెళ్లి చికిత్స పొందారు. అలాగే వారికి ఏఆర్వీ వాక్సిన్ అందించినట్లు వైద్యులు తెలిపారు.

కుంతీమాధవస్వామి కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

పిఠాపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న పిఠాపురంలోని కుంతీమాధవ స్వామి కల్యాణోత్సవాలకు విస్తృత ప్రచారం కల్పించాలని వీహెచ్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం కుంతీమాధవ స్వామి దేవస్థానాన్ని సందర్శించి కల్యాణోత్సవాలకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. కల్యాణం, రథోత్సవం ఘనంగా నిర్వహించాలని ఈవో సున్న శ్రీరాములను కోరారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి భావనారుషి స్వామి కల్యాణోత్సవాలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణోత్సవాలు, అష్టోత్తర శతకళశ స్నపన మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 9వ తేదీ వరకూ జరుగుతాయి. 4వ తేదీన మూలవిరాట్‌లకు ఏకాదశ రుద్రాభిషేకములు, 28 పుణ్యనదుల తీర్థములు, 108 కలశాలతో ప్రదర్శనగా తరలివచ్చి శివ మార్కండేయ స్వామి వారి సన్నిధిలోని భావనాఋషి, భద్రావతి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రికి కల్యాణం జరుగుతుంది. కల్యాణోత్సవాల్లో భాగంగా శూలాల సంబరం, 8న రాత్రి స్వామి,అమ్మవార్ల శ్రీపుష్పయాగం జరుగుతాయి. భక్తులు అధికంగా పాల్గొనాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

కమిషనర్ బాధ్యతల స్వీకరణ

సామర్లకోట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌గా ట్రైనీ కలెక్టర్ హెచ్.ఎస్.భావన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ కమిషనర్‌గా వ్యవహరించిన శ్రీవిద్య భావనకు పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు.కమిషనర్‌ను అధికారులు అభినందించారు.


కమిషనర్‌కు బొకే అందజేస్తున్న దృశ్యం

ఘనంగా వసంత పంచమి పూజలు




సామర్లకోట: పూజల్లో ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల బాబు, విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప, గొల్లప్రోలు: తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో వసంత పంచమి పురస్కరించుకుని ఆలయంలో సరస్వతి అమ్మవారి ఉపాలయం వద్ద సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామ స్వామి(బాబు) పాల్గొన్నారు. పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, వెంకన్న, రాజశేఖర శర్మ, అంజిబాబు, కొంతేటి భీమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకటరమణ తదితరులతో అమ్మవారికి పంచద్రవ్యాలతో అభిషేకించారు. హోమపూజలు నిర్వహించారు. ఈపూజల్లో సామర్లకోట పట్టణం, పరిసర గ్రామాల నుంచి వందలాదిగా విద్యార్థులు పాల్గొన్నారు. పూజల అనంతరం సరస్వతి అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. దాతలు కొండపల్లి కృష్ణమూర్తి దంపతులు విద్యార్థులకు పెన్నులు, బిస్కెట్లు, దేవీ ఫిషరీస్‌చే నోట్ పుస్తకాలు, కటకం సృజన్ దంపతులు అమ్మవారి చిత్రపటాలు సమకూర్చారు. వాటిని ఎమ్మెల్యే చినరాజప్ప, తుమ్మల బాబులు విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులకు నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఇంచార్జి వెంకటరమణ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు), తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పారిశ్రామిక వేత్తలు పసల పద్మరాఘవరావు, బిక్కిన పర మేశ్వర సాయి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అపర్ణాదేవి ఆలయంలో పూజలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో వసంతి పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. సోమవారం అపర్ణాదేవిని సరస్వతిదేవిగా అలంకరించారు. అమ్మవారి చెంతన సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. వేదపండితుడు ఆకొండి వెంకటేశ్వర శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు ప్రభాకరశాస్త్రిలు పూజాది కార్యక్రమాలు జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు. దుర్గాడ శివాలయంలో సోమవారం వసంత పంచమి సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. లలితా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. విద్యార్థినీ విద్యార్థులతో గణపతి పూజ, సరస్వతి పూజ చేయించి అక్షరాభ్యాసాలు చేయించారు. విద్యార్థులకు పూజలో ఉంచిన పెన్నులు అందజేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు. అలాగే దుర్గాడలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. గ్రామంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో సరస్వతి దేవిని పూజించి చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. పాఠశాల కరస్పాండెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పాదగయలో సరస్వతి పూజలు

పిఠాపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వసంతి పంచమి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో కొలువై ఉన్న సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు. విద్యార్థులు సరస్వతి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయం ప్రారంభం


విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్న బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్

గొల్లప్రోలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయం, కృష్ణుడి ఆలయాల్లో సోమవారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల పట్టాభిషేక విగ్రహాల ప్రతిష్ఠ, శ్రీకృష్ణుడు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయ నిర్మాణ, స్థల దాతలు శీరం సుబ్బారావు, కనకరత్నం చేతుల మీదుగా పూజాది కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమానికి భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ హాజరయ్యారు. ప్రతిష్ఠా కార్యక్రమాల్లో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో ముందుకు వచ్చిన సుబ్బారావు దంపతులను అభినందించారు.

ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా సుందర్ పోటీ


మేనిఫెస్టో బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్ తదితరులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా తన కుమారుడు సుందర్ పోటీ చేస్తున్నారని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ వెల్లడించారు. కాకినాడలోని ఓ హోటల్‌లో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత, గత ప్రభుత్వాలు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి మోసం చేశాయన్నారు. తనకు తొలి నుంచి అన్యాయాన్ని ప్రశ్నించేతత్వం ఉండడంతో తన కుమారుడు సుందర్‌ను పట్టభద్రుల స్థానానికి పోటీలో నిలిపానన్నారు. ఆయనను గెలిపిస్తే ప్రజలు, పట్టభద్రుల సమస్యలను మండలిలో వినిపిస్తారన్నారు. అభ్యర్థి జీవీ సుందర్ మాట్లాడుతూ గతంలో పనిచేసిన పట్టభద్రల ఎమ్మెల్సీలు మండలిలో ఉద్యోగుల సమస్యలపై మాట్లాడారు తప్ప పట్టభద్రుల గురించి ప్రస్తావించలేదన్నారు. మేనిఫెస్టో బ్రోచర్‌ను విడుదల చేశారు. ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, నాయకులు కాశీలక్ష్మణస్వామి, నేతల హరిబాబు, కంభం రాజబాబు, బొజ్జా ఐశ్వర్య పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ వద్ద డొక్కా సీతమ్మ విగ్రహం

పిఠాపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న అన్నక్యాంటీన్ భవనం వద్ద డొక్కా సీతమ్మ విగ్రహం ఏర్పాటుకు సహకారం అందజేస్తానని ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఫైండా వీర ప్రభాకరరావు ప్రకటించారు. ఫైండా రామలక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా సోమవారం అన్నక్యాంటీన్ వద్ద పేదలకు భోజనం టిక్కెట్లు తీసుకుని ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్ సారా శేఖర్, కర్రి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

14మంది వాహనదారులకు జైలు శిక్ష

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి బైక్ నడిపిన 14 మంది వాహనదారులకు 4రోజుల చొప్పున జైలు శిక్షను విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణలోభాగంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ ట్రాఫిక్ 1, 2 పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్‌డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా 26 మంది వాహనదారులు మద్యంతాగి బైక్‌లు నడుపుతున్నట్లు పోలీసులు నిర్ధారించి కోర్టులో ప్రవేశపెట్టారు. ఇందులో 14మంది వాహనదారులకు 4రోజుల చొప్పున జైలుశిక్ష, 12మందికి రూ.10వేల వంతున రూ.1.20లక్షలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ సీఐలు డి.రామారావు, రమేష్ తెలిపారు.

ఘనంగా జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో కాకినాడ ఐఎంఏ ఆధ్వర్యంలో కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ కోసం మహిళా వైద్యులు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవన్నారు. వైద్య వృత్తిలో మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. 1849లో యూఎస్ఏలోవైద్య పట్టా పొందిన తొలి మహిళా డాక్టర్ ఎలిజబెత్ బ్లాక్‌వెల్ పుట్టిన రోజు పురస్కరించుకుని మహిళా వైద్యుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీవల్లిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సిరాజ్, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ చైతన్య బాను పాల్గొన్నారు.

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కాకినాడరూరల్,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): కాకినాడ మధురానగర్‌కు చెందిన 16ఏళ్ల వీసం సత్యసాయి శ్రగ్విన్ సోమవారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయం సామాజిక మాధ్యమాల్లో రావడంతో ఉదయం విశాఖపట్నం వెళ్లే రైలు ఎక్కాడని ఆ బాలుడు తిరిగి పాసింజర్ రైలులో వస్తున్నాడని సమాచారం తెలియడంతో ఇంద్రపాలెం పోలీసులు సామర్లకోట రైల్వేస్టేషన్‌కు చేరుకుని శ్రగ్విన్‌ను క్షేమంగా ఇంద్రపాలెం స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సీపీఎం ధర్నా


తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పిఠాపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీపీఎం నాయకులు అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు విషయాన్ని బడ్జెట్‌లో కనీసం ప్రస్తావించలేదని విమర్శించారు. విశాఖ స్టీలు ప్లాంటుకు నిధులు ఇస్తున్నామని చెప్పడం మినహా కేటాయింపులు జరపలేదని, కేంద్ర విద్యాసంస్థలకు నిధులు కేటాయింపులు లేకపోవడం దారుణమన్నారు. పోలవరం, రాజదాని అమరావతి నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో సీపీఎం నాయకులు కుంచే చిన్నా, కోనేటి రాజు, కె.మణి, నాగేశ్వరరావు, వీరబాబు, సూర్యనారాయణ స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటుతో ఫోన్ కేబుల్ ధ్వంసం


కొత్తపల్లి ఊరచెరువుసెంటర్లో మంచినీటి పైప్‌లైన్ కోసం తవ్విన గొయ్యి, తెగిన కేబుల్


కొత్తపల్లి ధర్మశాస్తా ఆలయం సమీపంలో మట్టిని రోడ్డుపైన ఉంచేసిన దృశ్యం

కొత్తపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మంచినీటి సరఫరా కోసం పైప్‌లైన్ ఏర్పాటు చేస్తుండగా టెలిఫోన్ కేబుల్ తెగిపోవడంతో కొత్తపల్లి మండలంలో ఫోన్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో వివిధ గ్రామాలకు తాగునీటి సరఫరా చేసేందుకు పాతపైప్‌లైన్ స్థానే కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకోసం ఇటీవల రోడ్డు ప్రక్కన పొడవునా గోతులు తవ్వుతున్నారు. అయితే గతంలో రోడ్డు ప్రక్కన అడుగుభాగంలో బీఎస్ఎన్ఎల్ కేబుల్ ఏర్పాటుచేశారు. పైప్‌లైన్ కోసం ప్రొక్లెయిన్‌తో రోడ్డుకు పొడవునా తవ్వుకుంటూ పోతున్నారు. దీంతో కొత్తపల్లిలో ఉన్నటెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌కు చెందిన కేబుల్ పూర్తిగా తెగిపోవడంతో ల్యాండ్‌లైన్లు, మొబైల్‌ఫోన్లు పని చేయకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గోతులు తవ్విన మట్టిని రోడ్డుపైనే వదిలేశారు. వాహనాల వేగానికి దుమ్ము లేచి ప్రయాణికుల కళ్లలో పడటంతో వారు గాయాలపాలవుతున్నారు. తెగిపోయిన కేబుల్‌కు మరమ్మతులు చేపట్టాలని, దుమ్ము లేవకుండా మట్టిపై వాటరింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం సత్యదేవుని సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. వార్షిక కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లను ఉంచి ఉదయం

నేడు రత్నగిరిపై సూర్య నమస్కారాలు

8.30 గంటల నుంచి ప్రత్యేక పూజలు జరుపుతారు. అనంతరం ఆరోగ్యప్రదాత అయిన సూర్య భగవానుడికి సూర్య నమస్కారాలు నిర్వహిస్తారని ఆలయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



డైరీని ఆవిష్కరిస్తున్న సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు

సీలేరు సీఈని కలిసిన టీఎన్టీయూసీ కార్యవర్గం

మోతుగూడెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టీఎన్టీయూసీ నూతన కార్యవర్గ సభ్యులను రాష్ట్ర అధ్యక్షుడు పర్వతాయని సాంబశివరావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేతు మధుసూదన్‌రెడ్డి సోమవారం సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావుకు పరిచయం చేశారు. తొలుత వారు సీఈకి టీఎన్టీయూసీ డైరీ అందజేసి సంఘ సమస్యలను వివరించారు. అనంతరం ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణను కలిసి నూతన డైరీ అందజేశారు. కార్యక్రమంలో లోయర్ సీలేరు టీఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు టి.త్రినాథరావు, కార్యదర్శి జాజుల రత్నాకర్, కోశాధికారి ఎం.లక్ష్మణరావు, బ్రాంచ్ ప్రెసిడెంట్ ఎస్.కిరణ్, సెక్రటరీ జి.రవికుమార్, సభ్యుడు ఆర్ఎస్ రామారావు, ఓఎస్ఎన్ మూర్తి పాండే తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనకే 'ప్రేరణ'





చింతూరులో జరిగిన జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

చింతూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే ప్రేరణ ముఖ్య లక్ష్యమని చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా అన్నారు. సోమవారం చింతూరు ఆదిమ గురుకుల కళాశాల ప్రాంగణంలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రేరణ (జాబ్ మేళా) నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ మన్యంలో చాలా మంది అవగాహన లేమి, సమాచార లోపం కారణంగా నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారన్నారు. 105 మంది హాజరుకాగా ఎన్నోసోర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజరు ఉన్నికృష్ణన్, హెచ్ఆర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది ఇంటర్వ్యూ చేశారు. చింతూరు సీఐ టి.దుర్గాప్రసాద్, ఎస్ఐ పి.రమేష్, ఎటపాక సీఐ ఎం.కన్నప్పరాజు, మోతుగూడెం ఎస్ఐ శివనారాయణ పాల్గొన్నారు.



కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపిక

ఎటపాక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ సెలక్షన్‌లో చింతూరు డివిజన్‌కు చెందిన 9 మంది వ్యాయామ ఉపాధ్యాయులు షాట్‌పుట్, జావలిన్‌త్రో, ఫుట్‌బాల్, వాలీబాల్, లాంగ్ జంప్, అథ్లెటిక్స్‌ల్లో ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీడీ డేగలయ్య

'స్త్రీ నిధి సొమ్ములు దుర్వినియోగం చేస్తే చర్యలు'

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్త్రీ నిధి సొమ్ములను దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని వెలుగు ఏపీడీ డేగలయ్య హెచ్చరించారు. సోమవారం ఆయన మండలంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీ నిధి సొమ్ములు లబ్ధిదారులకు అందకుండా అధికారులు, వీవో లీడర్లు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవన్నారు. రుణాలను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేయాలన్నారు. లబ్ధిదారుల నుంచి రుసుము తీసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వెలుగు ఏపీఎం వీరాంజనేయులు, సీసీలు, వీవో లీడర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

చింతూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఐటీడీఏ నేతృత్వంలో ప్రతి బుధవారం నిర్వహించే మీకోసం... ప్రజా సమస్యల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేసినట్టు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వచ్చే నెల 8వ వరకు గ్రీవెన్స్ జరగదన్నారు.

డీఎడ్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత

రంపచోడవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో 2023-25 విద్యా సంవత్సరం రెండో సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎం.చినబాబు తెలిపారు. 18 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారన్నారు.

'ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి'

రంపచోడవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన రోగులకు ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి రూ.50వేలు విలువైన టెనిక్ ప్లేజ్ ఇంజక్షన్ ఉచితంగా చేస్తామని సూపరింటెండెంట్ టీవీ శేషిరెడ్డి తెలిపారు. గత సంవత్సరం 13 మందికి ఇంజక్షన్లు చేసినట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కిరణ్



కూనవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా బొప్పెన కిరణ్ ఎన్నికయ్యారు. ఈయనకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల్లో మంచి గుర్తింపు ఉంది. పోలవరం ఉద్యమంలోనూ గిరిజన సమస్యలపై పోరాటం చేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు





ఏలేశ్వరంలో సామూహిక అక్షరాభ్యాసం (పైన) గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో...



ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి భారతి విద్యానికేతన్‌లో సరస్వతి దేవి పూజ నిర్వహిస్తున్న అధినేత వీరబాబు దంపతులు

సరస్వతీ నమస్తుభ్యం

గండేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యా ప్రాంగణంలో వసంత పంచమిని సోమవారం వేడుకగా నిర్వహించారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి-లక్ష్మీరాజ్యం దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు శ్రీరామ్‌శర్మ, ప్రసాద్‌శర్మ విఘ్నేశ్వరపూజ, సరస్వతి అమ్మవారికి విశేష అభిషేకాలు, సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. తల్లిదండ్రులు చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు. విద్యార్థులకు పలక, బలపాలు, పుస్తకాలు, పెన్నులను లక్ష్మీరాజ్యం అందించారు. ఆదిత్య వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీసత్యనారాయణ స్కూల్లో కరస్పాండెంట్ పైల రాణాప్రతాప్‌సింగ్, పురోహితులు పిల్లలతో అక్షరాభ్యాసం చేయించి పెన్నులు, పలకలు, సరస్వతీ దేవి ఫొటోలు అందజేశారు. తమ్మారావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మంగి భారతి విద్యానికేతన్‌లో సరస్వతీదేవికి పూజలు నిర్వహించి కరస్పాండెంట్ సుంకర వీరబాబు ఆధ్వర్యంలో 450 మంది చిన్నారులకు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య సామూహిక అక్షరాభ్యాసం చేశారు. క్రైస్తవ, ముస్లిం పెద్దల ప్రార్థనలతో మరో 100 మంది చిన్నారులు అక్షరాభ్యాసం స్వీకరించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి పీఠాధిపతి రామానంద స్వామిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఉత్తరకంచిలోని ఆక్స్‌ఫర్డ్, ధర్మవరంలోని ప్రతిభ, ఆదర్శ విద్యాలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): కేవో మల్లవరం, జగన్నాథపురం గ్రామాల్లో చిన్నారులు సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

తొండంగి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్లపురం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చాట్రాతి సత్యనారాయణ ఆధ్వర్యంలో సరస్వతీ పూజ నిర్వహించారు. సామూహిక సరస్వతీ ప్రార్థన చేసి శ్రీపంచమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఎ.కొత్తపల్లి కదంబ క్షేత్రంలో సరస్వతి పూజ జరిపారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీహర్ష ఇంగ్లిష మీడియం స్కూల్లో చైర్మన్ కోరుప్రోలు బుజ్జిబాబునాయుడు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. వేదపండితులు చిన్నారులతో అక్షరాలు దిద్దించారు.

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో వసంత పంచమిని వేడుకగా నిర్వహించారు. సరస్వతీదేవికి విద్యార్థులకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ప్రైమరీ, పదో తరగతి విద్యార్థులకు పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారిని చదువుల తల్లిని సరస్వతీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. సరస్వతీ హోమాన్ని ఆలయ పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన విద్యార్థులు వార్షిక ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించేందుకు మనోధైర్యం పెంపొందించాలని అమ్మవారికి అర్చన, పూజలు చేశారు. ఆలయ ఈవో విశ్వనాథరాజు, పాలకమండలి సభ్యులు పాల్గొని అమ్మవారి పూజలో ఉంచిన పెన్నులను పంపిణీ చేశారు.



తుని మండలం లోవ దేవస్థానంలో సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థులు



కోటనందూరు మండలం జగన్నాథపురంలో...

రామలింగేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన భవనం ప్రారంభం

జగ్గంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీదుర్గా రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రతి సోమవారం భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఇందుకు అనువుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతన అన్నదాన భవనం నిర్మించారు. దీనిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సోమవారం ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఆలయ కమిటీ చైర్మన్ బూసాల కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, రాజపూడి సర్పంచ్ బూసాల విష్ణు, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, భూపాలపట్నం ప్రసాద్, దేవస్థానం వైస్ చైర్మన్ పట్నాల బాల అచ్యుతరాయుడు, దేవస్థానం కమిటీ సభ్యులు కందుల శ్రీనివాసరావు, అడ్లబోయిన అప్పలరాజు (చంటి), నక్క వెంకటేశులు, బొడ్డు నాగేశ్వరరావు, బత్తుల కాటమస్వామి, పటని రాంబాబు, గజ్జల శ్రీనివాసరావు, గొర్రిపాటి భాను చందు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్

జగ్గంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. సోమవారం మండలంలోని జె.కొత్తూరు మాజీ ఎంపీటీసీ గొంతిన శేషు జ్ఞాపకార్థం వారి మనుమడు గొంతిన సాయికృష్ణ ఆర్థిక సహాయంతో అన్న క్యాంటీన్ నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, దాతలు సాయికృష్ణ, శేషుల కుమార్తె నకిరెడ్డి మంగతో కలిసి భోజనాలు వడ్డించారు. మారిశెట్టి భద్రం, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, చల్లా రామ్మూర్తి, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, భూపాలపట్నం ప్రసాద్, దాసనికత సీతారామయ్య, బద్ది సురేష్, అడపా తాతాజీ, దేగల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిలో 'వెబ్ ఇన్నోవేషన్ విత్ డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్

గండేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో 'వెబ్ ఇన్నోవేషన్ విత్ డిజైన్ థింకింగ్' అంశంపై వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా బ్రెయినో విజన్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ అకాడమీకి చెందిన శ్రీనారాయణస్వామి విచ్చేశారని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తమను తాము మెరుగుపరుచుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ (మేనేజ్‌మెంట్) ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ (అకడమిక్స్) డాక్టర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నరేష్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పరిశీలన

గండేపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండేపల్లి, మల్లేపల్లి గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఎంపీడీవో నాతి బుజ్జి పరిశీలించారు. ప్రతి గురువారం కంపోస్టు అమ్మకం జరిగేలా చూడాలన్నారు. ప్రజలకు షెడ్ల నిర్వహణపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో వెంట విస్తరణాధికారి చంద్రశేఖర్, సెక్రటరీ ఫణీంద్రకుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది ఉన్నారు.

ఊమారామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలకు శ్రీకారం

రౌతులపూడి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి శివాలయంలో శ్రీఉమా రామలింగేశ్వస్వామి కల్యాణోత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. పందిరి రాట పాతిన అనంతరం అధిక సంఖ్యలో మహిళలు పసుపు దంచారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

తుని రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడి పని చేసే వారికి సముచిత స్థానం ఉంటుందని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తుని మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేశారు. టీడీపీ తిమ్మాపురం గ్రామ సీనియర్ నాయకులు కాపారపు అబ్బులు, అచ్యుతరావు ఆధ్వర్యంలో అప్పన కొండబాబు, వనపర్తి సుబ్బారావు, వెంటూరి అచ్చారావు, రమణ, రెడ్డి బాబూరావు, దోమాడ ఈశ్వరరావు, జువ్వల కన్నారావు, గండిపల్లి జనార్దన్, పోలవరపు గోవిందు, షేక్ దుర్గాసాహెబ్ టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

యువతకు కౌన్సిలింగ్

జగ్గంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సీఐ వెఆర్కే శ్రీనివాస్, ఎస్ఐ రఘునందనరావు సోమవారం యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పద్మనాభనగర్‌లోని 9 వీధులు, శ్రీరామ్‌నగర్ శివారులో పోలీసు సిబ్బంది ఇంటింటికీ తిరిగారు. ఎటువంటి గొడవలకు వెళ్లొద్దని, క్రమశిక్షణతో మెలగాలని, గంజాయి లాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని సూచించారు. సీఐ మొబైల్ నెంబర్లతో ఉన్న కార్డులు ఇచ్చారు. గొడవలు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే సమాచారం అందించాలని సీఐ కోరారు.

నేడు శంఖవరం మండల సమావేశం

శంఖవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శంఖవరం మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఏ విధమైన తీర్మానాలు చేయమని, శాఖల వారీగా సమీక్షిస్తామని చెప్పారు.

డిగ్రీ కళాశాలను పరిశీలించిన ఆర్జేడీ

తొండంగి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలను ఆర్జేడీ డాక్టర్ శోభారాణి సోమవారం పరిశీలించారు. కార్యాలయంలో రికార్డులను చూసి తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నించారు. సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. కళాశాలకు అవసరమైన భవనాల నిర్మాణం గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆర్జేడీ వెంట ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్, దివాకర్, రాము కృష్ణారావు, మహాలక్ష్మి నాయుడు, కిరణ్, సతీష్ ఉన్నారు.

'అరాచకాలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోం'

తుని రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అరాచకాలు సృష్టిస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని మున్సిపల్ మాజీ చైర్మన్, టీడీపీ తుని పట్టణ శాఖ అధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ స్పష్టం చేశారు. సోమవారం ఆయన టీడీపీ కార్యాలయంలో నాయకులు మోతుకూరి వెంకటేష్, పార్టీ శ్రేణులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికల వేళ వైసీపీ నాయకుల్లో అలజడి నెలకొందన్నారు. కౌన్సిలర్ల సంఖ్యాబలం ఉన్నప్పుడు ఉలికిపాటు ఎందుకుని, క్యాంపు రాజకీయాలకు ఎందుకు తెరతీశారని ప్రశ్నించారు. మచ్చలేని తమ నేత యనమల రామకృష్ణుడుపై అవాకులు చవాకులు పేలడం తగదన్నారు. ఎమ్మెల్యే యనమల దివ్య చొరవతో తుని మున్సిపాల్టీలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు మళ్ల గణేష్, లంకా సునీల్, కుక్కడపు బాలాజీ, సిద్ధార్థపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు


'టీడీపీ కార్యకర్తలను ఎలా అనుమతించారు'

తుని రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): యనమల రామకృష్ణుడు కార్యకర్తలు, రౌడీలను పంపించి ప్రజాస్వామ్యంగా జరగాల్సిన ఎన్నికలను వాయిదా వేయించారని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆరోపించారు. ఎస్.అన్నవరంలోని తన స్వగృహంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలోకి చైర్మన్‌ను అనుమతించని పోలీసులు టీడీపీ కార్యకర్తలను ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ఎన్నికలు సజావుగా జరగకుండా చేసిన యనమల ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

బూరుగుపూడిలో భీష్మ ఏకాదశికి భారీ ఏర్పాట్లు



కిర్లంపూడి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడిలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ 39వ వార్షిక మహోత్సవాలను రూ.40లక్షలతో ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త, ఉత్సవ కమిటీ చైర్మన్ కర్నాకుల పెదకాపు తెలిపారు. సోమవారం ఆయన కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంగళవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. భీష్మ ఏకాదశి నాడు సాంస్కృతిక ప్రదర్శనలు, భారీ ఎగ్జిబిషన్, బాణసంచా కాల్పులు ఉంటాయన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా 500 మంది వలంటీర్లను నియమించామన్నారు. జాతర రోజున అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. కమిటీ సభ్యులు మిరియాల వెంకటేశ్వర్లు, బెల్లపుకొండ గోవిందస్వామి, అడపా గణేష్, బత్తుల దుర్గాజీ తదితరులు పాల్గొన్నారు.